నమస్తే తెలంగాణ

బీఆర్‌టీయూ సమావేశంలో అభివాదం చేస్తున్న ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారయ్య, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్, కార్మిక విభాగం అధ్యక్షుడు రాంబాబు, ఆటో యూనియన్ నాయకులు

ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలకు బాధ్యుడు రేవంతే

మొదటిపేజీ తరువాయి...

పొల్పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆటోడ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, దీన పరిస్థితులపై చర్చించేందుకు ఆదివారం తెలంగాణభవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మారయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ఆటోడ్రైవర్ల బతుకు అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కారణంగా ఆటోడ్రైవర్ల ఉపాధి దెబ్బతిని 58 మంది ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వం ఆదుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆటోడ్రైవర్లకు ఏటా రూ.12 వేలు ఇస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటుచేస్తామని రేవంత్‌రెడ్డి, తీన్మార్ మల్లన్న పదే పదే చెప్పారని గుర్తుచేశారు. ఆటోడ్రైవర్ల చావులకు రేవంత్‌రెడ్డి, తీన్మార్ మల్లన్నే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఈ రెండు అంశాలపై చర్చించాలని, లేనిపక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

అక్రమ ఫైనాన్సర్ల ఆగడాలను అరికట్టాలి

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 2 లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉన్నారని, వీటిలో 90 శాతం ఆటోలు ఫైనాన్స్ మీదే నడుస్తున్నాయని మారయ్య తెలిపారు. అధిక వడ్డీతో ఆటోడ్రైవర్ల శ్రమను దోచుకుంటున్న అక్రమ ఫైనాన్స్‌లపై నిఘా పెట్టి వాటిని చట్టపరిధిలోకి తీసుకొచ్చి, వారి ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. షాపింగ్‌మాల్స్ వద్ద ఆటోస్టాండ్లు ఉండాలని, అవి లేకపోవటంతో అక్కడ నిలిపిన ఆటోడ్రైవర్లకు పోలీసులు చలాన్లు రాస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రేటర్‌లో ఆటోమీటర్ సిస్టం పెట్టాలని, మీటర్ రేట్లు కూడా పెంచాలని డిమాండ్ చేశారు. మోటర్ రంగంపై సీఎం ఇంతవరకు ఎందుకు సమీక్ష నిర్వహించలేదని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్, టీఏటీయూ నాయకులు పాండునాయక్, రవీందర్, రామకృష్ణ, శాతం రమేశ్, నిరంజన్, హైమద్, పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

డౌన్‌మెరిట్ లేనట్టే.. మళ్లీ బ్యాక్‌లాగ్

- గురుకుల పోస్టుల్లో డౌన్‌మెరిట్ కల్పిస్తామని ఆశలు.. ఇప్పుడు నోటిఫికేషన్ ప్రకారమేనని ప్రకటన
- స్వయంగా వెల్లడించిన సీఎం రేవంత్‌రెడ్డి
- గురుకుల అభ్యర్థుల్లో ఆందోళన

హైదరాబాద్, జూలై14 (నమస్తే తెలంగాణ) : గురుకుల పోస్టుల్లో బ్యాక్‌లాగ్ లేకుండా చూస్తామని, వెయిటింగ్ జాబితా అమలును పరిశీలిస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కాడెత్తేసింది. నోటిఫికేషన్ ప్రకారమే పోస్టులు భర్తీ చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి తాజాగా చేసిన ప్రకటనే అందుకు నిదర్శనం. దీంతో గురుకుల అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

చాలా పోస్టులు భర్తీకాని పరిస్థితి..

రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ గురుకులాల్లో 9,210 పోస్టుల భర్తీ ప్రక్రియను తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్)కు అప్పగించిన విషయం తెలిసిందే. డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీకి కామన్ పేపర్లను పెట్టడం, డిసెండింగ్ ఆర్డర్ పాటించకపోవడంతో చాలా పోస్టులు భర్తీకాని దుస్థితి నెలకొన్నది. ఇదే విషయమై అభ్యర్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితాలను వెల్లడించి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చినప్పటి నుంచి ప్రభుత్వానికి విజ్ఞప్తులు వస్తూనే ఉన్నాయి. పోస్టులు బ్యాక్‌లాగ్ కాకుండా ఉండేందుకు డౌన్‌మెరిట్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నాలకు దిగారు. నోటిఫికేషన్ ప్రకారమే పోస్టులను భర్తీ చేస్తామని సీఎం ప్రకటించడంతో అభ్యర్థుల ఆశలన్నీ గల్లంతయ్యాయి. గురుకుల పోస్టుల భర్తీకి సంబంధించి ట్రిబ్ జారీచేసిన నోటిఫికేషన్‌లోని పేరా 5(1)లో జీవో 81 ప్రకారం వెయిటింగ్ లిస్టు విధానం లేదు. భర్తీ కాని, అభ్యర్థులు జాయినింగ్ కాని ఖాళీలను క్యారీ ఫార్వడ్ చేసి రాబోయే నోటిఫికేషన్ ద్వారా నింపాల్సి ఉంటుంది.

2016లో డౌన్‌మెరిట్ కల్పించిన బీఆర్‌ఎస్ సర్కార్

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీవో 81ను పక్కన పెట్టి 2016లో వన్ టైం రిలాక్సేషన్ కింద డౌన్ మెరిట్ ఆపరేట్ చేసి పోస్టులను భర్తీ చేసింది. ప్రస్తుత పోస్టుల్లోనూ బ్యాక్‌లాగ్ లేకుండా డౌన్ మెరిట్ కల్పించే అవకాశమున్నా కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోవడంపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జేఎల్‌తో మరిన్ని ఖాళీలు..

డీఎల్, జేఎల్, పీజీటీ పోస్టులకు సమాన అర్హతలున్నాయి. చాలా మంది పీజీటీతోపాటు జేఎల్, డీఎల్‌కూ హాజరయ్యారు. వారిలో చాలా మంది ఒకటికి మించి పోస్టులకు ఎంపికయ్యారు. దీంతో ఉన్నతస్థాయి పోస్టును ఎంచుకుని మిగిలిన పోస్టులను వదులుకున్నట్టు తెలుస్తున్నది. పీజీటీ పోస్టుల్లోనే 70 శాతం మిగిలిపోనున్నట్టు సమాచారం. గురుకులాల్లోని పోస్టులకు పరీక్ష రాసిన అభ్యర్థుల్లో అందరూ జేఎల్ పోస్టులకు సైతం హాజరయ్యారు. గురుకులాల్లో పోస్టులు సాధించిన అభ్యర్థులే ఇందులోనూ ఎంపికైనట్లు తెలుస్తున్నది. జేఎల్ పోస్టులకే మొగ్గుచూపే అవకాశముంది. ఈ నేపథ్యంలో గురుకుల పోస్టుల్లో మరిన్ని ఖాళీలు మిగిలే అవకాశముంది.

మరో నోటిఫికేషన్‌కు మొగ్గు..

డౌన్‌మెరిట్ ఆపరేట్ చేసి పోస్టులు బ్యాక్‌లాగ్ కాకుండా చూసే అవకాశమున్నా కాంగ్రెస్ సర్కార్ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ప్రస్తుత నోటిఫికేషన్‌లో మిగిలిన పోస్టులన్నీ క్యారీ ఫార్వార్డ్ చేయాలని చూస్తున్నది. ఆ పోస్టులతోపాటు ఇప్పటికే సొసైటీల వారీగా గతంలోనే మంజూరైన పోస్టులన్నింటినీ కలిపి మరో నోటిఫికేషన్ ఇచ్చి తమ ఖాతాలో వేసుకోవాలని యోచిస్తున్నది.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	34.1°c	21.1°c
రంగారెడ్డి	32.6°c	21.9°c
మెదక్	32.3°c	23.3°c
ఖమ్మం	32.0°c	27.0°c
నిజామాబాద్	31.3°c	24.9°c
కరీంనగర్	29.0°c	25.0°c
వరంగల్	29.0°c	24.0°c
నల్లగొండ	29.0°c	21.0°c
మహబూబ్‌నగర్	27.7°c	24.1°c
హైదరాబాద్	29.1°c	24.1°c

మేడిగడ్డకు 41,200 క్యూసెక్కుల వరద

మహదేవపూర్, జూలై 14 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌కు వరద ప్రవాహం కొనసాగుతున్నది. 16.17 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం కలిగిన బరాజ్‌కు ఆదివారం ఇన్‌ఫ్లో 41,200 క్యూసెక్కులు కాగా, 8 బ్లాక్‌లలోని 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో ప్రవాహాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. బరాజ్ రివర్ బెడ్ లెవల్ సముద్ర మట్టానికి 88 మీటర్లు కాగా, ప్రస్తుతం 89.50 మీటర్ల ఎత్తులో వరద ప్రవహిస్తున్నది. వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నదని అధికారులు చెబుతున్నారు.

నేటినుంచి బదిలీలు, ప్రమోషన్లు

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఎస్సీ గురుకులాల్లో బదిలీలు, ప్రమోషన్లు, నూతన నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. క్యాడర్లవారీగా బదిలీల షెడ్యూలు విడుదలచేస్తూ అధికారులు ఉత్తర్వులు ఇవ్వడంపై గురుకుల జేఏసీ అధ్యక్షుడు మామిడి నారాయణ, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, ఎస్సీ గురుకుల సంస్థ వైస్ చైర్మన్, ఎస్సీడీడీ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, గురుకుల సంస్థ కార్యదర్శి అలగు వర్షిణి, హెడ్ ఆఫీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

పింఛన్ల రికవరీలపై వెనకడుగు!

మొదటిపేజీ తరువాయి...

లబ్ధిపొందుతున్న అంశంపై ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఎటువంటి రికవరీ చర్యలు చేపట్టరాదని స్పష్టంచేశారు. వివిధ సంక్షేమ పథకాల్లో అనర్హులు లబ్ధిపొందుతున్నట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు మరింత మెరుగైన పద్ధతుల్లో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసేందుకు సంప్రదింపులు చేపట్టినట్టు తెలిపారు. సంక్షేమ పథకాల్లోని వివిధ సమస్యలు, వాటి పరిష్కారాలపై వచ్చే శాసనసభ సమావేశాల్లో చర్చించనున్నట్టు వెల్లడించారు. నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించడంతోపాటు అనర్హులు పొందిన ప్రయోజనాలను రికవరీ చేసే విషయమై ప్రభుత్వం త్వరలో స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేస్తుందని పేర్కొన్నారు. వృద్ధులకు అండగా ఉండేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం అత్యంత మానవీయ కోణంలో ఆసరా పథకాన్ని అమలు చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనర్హుల పేరుతో అప్పుడిచ్చిన పెన్షన్ మొత్తాలను రికవరీ చేసేందుకు సిద్ధపడటం వివాదస్పదమైంది. పెన్షన్లను రూ.2,000 నుంచి రూ.4,000కు పెంచుతామని ఎన్నికల ప్రచారంలో చెప్పిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ఉన్న పింఛన్లనే ఊడబీకే పని పెట్టుకున్నది. రాష్ట్రవ్యాప్తంగా 1,826 మంది అనర్హులు ఉన్నారంటూ ఒక జాబితాను రూపొందించిన సర్కారు, వారినుంచి పెన్షన్లను రికవరీ చేయాలని అధికారులను ఆదేశించింది. ఈ క్రమంలోనే భద్రాద్రి కొత్తగూడెంలోని బాబాక్యాంపునకు చెందిన దాసరి మల్లమ్మకు జారీచేసిన నోటీసులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలొచ్చాయి. వృద్ధాప్యంతోపాటు పక్షవాతంతో మంచానికే పరిమితమైన మల్లమ్మకు రికవరీ నోటీసులు జారీచేయడంతో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. దీంతో అధికార యంత్రాంగం హుటాహుటిన మల్లమ్మ ఇంటికి చేరుకొని ఆమె ఆర్థిక, కుటుంబ పరిస్థితులపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఉద్యోగం చేస్తున్న కూతురు మరణించడంతో మల్లమ్మకు ఫ్యామిలీ పెన్షన్ వస్తున్న విషయాన్ని అధికారులు గుర్తించారు. ఆమె పోషణ, వైద్య ఖర్చులకే భారీగా ఖర్చవుతుండటంతో ఆమె నుంచి రికవరీ చేయడం సాధ్యంకాదని అధికారులు గుర్తించారు. వృద్ధులకు సహజంగానే అనారోగ్య సమస్యలుంటాయి. వారిని సరిగా చూసుకునేవారు ఉండరనే ఉద్దేశంతోనే గత కేసీఆర్ సర్కారు ఆసరా పెన్షన్ల జారీలో కొంత ఉదారంగా వ్యవహరించింది. కాగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వారి ఆరోగ్య, కుటుంబ పరిస్థితులు పట్టించుకోకుండా రికవరీ నోటీసులు జారీచేయడం వివాదాస్పదమైంది. ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం పునరాలోచనలో పడింది.

గెజిటెడ్ ఎంఈవో పదోన్నతులివ్వండి: యూటీఎఫ్

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): నాన్ గెజిటెడ్ టీచర్ పోస్టులపై మాత్రమే కోర్టు స్టే ఉందని, గెజిటెడ్ పర్యవేక్షణధికారుల ఖాళీల్లో క్యాడర్ స్ట్రెంథ్ ప్రకారం టీచర్లకు పదోన్నతులివ్వాలని టీఎస్ యూటీఎఫ్ ప్రభుత్వాన్ని కోరింది. స్థానిక సంస్థల టీచర్లంటూ ఎవరులేరని, అంతా పాఠశాల విద్యాశాఖ నియంత్రణలోకి వచ్చారని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కే జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాన్ గెజిటెడ్ టీచర్ పోస్టులను ఏకీకృత జిల్లా క్యాడర్‌గా రాష్ట్రపతి ఉత్తర్వుల్లో పేర్కొన్న అంశంపై మాత్రమే హైకోర్టు స్టే కొనసాగుతున్నదని గుర్తుచేశారు. రెండు దశాబ్దాలుగా పర్యవేక్షక పోస్టులు భర్తీకాక సంక్షోభం నెలకొన్నదని, ప్రభుత్వం చొరవ తీసుకుని, వెంటనే ఉప విద్యాధికారులు, ఎంఈవో, డైట్, బీఈడీ కళాశాల అధ్యాపక పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీచేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

విద్యుత్తు కమిషన్‌పై సుప్రీంకు కేసీఆర్

- విచారణ చేపట్టనున్న ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు కమిషన్ అంశంపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. విద్యుత్తు కొనుగోళ్లు, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ల స్థాపనపై సమీక్షకు నియమించిన జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన దేశ అత్యున్నత న్యాయస్థానంలో సవాల్ చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చి 14న జారీచేసిన జీవో 9ని సవాలు చేస్తూ కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయటం, హైకోర్టు దాన్ని కొట్టివేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేసీఆర్ సుప్రీంకోర్టుకు వెళ్లారు. సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టనున్నది.

ఎప్‌సెట్ వెబ్ ఆప్షన్లకు నేడే ఆఖరు

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించే ఎప్‌సెట్ వెబ్ ఆప్షన్ల గడువు సోమవారంతో ముగియనుంది. కౌన్సెలింగ్‌కు హాజరైన వారు సోమవారం వరకు వెబ్‌ఆప్షన్లు ఎంచుకోవచ్చు. ఇప్పటివరకు 99,170 మంది అభ్యర్థులు వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరుకాగా, 90వేలకు పైగా అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదుచేసుకున్నారు. 19లోపు సీట్లను కేటాయిస్తారు. 173 ఇంజినీరింగ్ కాలేజీల్లో 98,296 సీట్లున్నాయి. కన్వీనర్ కోటాలో 70,307, మేనేజ్‌మెంట్ కోటాలో మరో 27,989 సీట్లున్నాయి. కన్వీనర్ కోటాలోని మొత్తం సీట్లల్లో 41,968 సీట్లు (59.69శాతం) సీఎస్‌ఈ, సీఎస్‌ఈ అనుబంధ బ్రాంచీల్లోనే ఉన్నాయి.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు సమ్మయ్య

ఎల్లో, రెడ్ కార్డుల విధానాన్ని నిలిపేయాలి

- టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు సమ్మయ్య

భూపాలపల్లి రూరల్, జూలై 14: సింగరేణి యజమాన్యం ఎల్లో, రెడ్ కార్డుల విధానాన్ని వెంటనే నిలిపేయాలని భూపాలపల్లి టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్షణ చర్యల్లో భాగంగా సింగరేణి యాజమాన్యం ఎల్లో, రెడ్ కార్డుల విధానాన్ని అమలు చేసే పనిలో ఉందని తెలిపారు. ఈ విధానం వల్ల పని ప్రదేశాల్లో ఉద్యోగులు పొరపాటు చేస్తే స్థానికంగా ఉండే అధికారులకు మెయిల్ పంపుతారు. తద్వారా కార్పొరేట్ ఆఫీస్ నుంచి తప్పు చేసిన కార్మికుడికి నేరుగా ఎల్లో కార్డు జారీ అయినట్టు ఫోన్‌కు సందేశం వస్తుందని తెలిపారు. ఎవరైనా కార్మికుడికి 3 సార్లు ఎల్లో కార్డు వస్తే అతడికి వెంటనే రెడ్ కార్డు జారీ చేస్తారని, రెడ్ కార్డు అందుకున్న కార్మికుడిపై యాజమాన్యం చార్జ్‌షీట్‌తోపాటు సస్పెన్షన్, ఇంక్రిమెంట్ కట్, డిస్మిస్ ఇలా ఏదైనా క్రమశిక్షణ చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. కార్మికుడికి రెడ్ కార్డు ఇచ్చి ఉద్యోగం నుంచి తొలగిస్తే అతడి కుటుంబ పరిస్థితి ఏంటనేది యాజమాన్యం ఆలోచించాలని సూచించారు. ఇప్పటికే కొందరు కార్మికులకు ఎల్లో కార్డులు జారీ అయినట్టు సందేశాలు వచ్చాయని తెలిపారు. ఈ విషయం టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి దృష్టికి వచ్చిన వెంటనే సీఎండీ, సంబంధిత అధికారులతో చర్చించడం జరిగిందని, ఈ సర్క్యులర్‌ను నిలిపేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గౌరీపతిశర్మ, నరేశ్, మధు, రాంచందర్, రాజేందర్, సురేశ్, రవి పాల్గొన్నారు.

ముందుకు సాగని బదిలీలు!

- విద్యాశాఖలో ఇంకా విడుదల కాని మార్గదర్శకాలు
- గడువు పొడిగింపు కోరే యోచనలో అధికారులు

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఆయా శాఖల్లో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది. ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి వద్దే ఉన్న విద్యాశాఖకు సంబంధించిన బదిలీల మార్గదర్శకాలే ఇంకా జారీ కాలేదు. ఇంటర్మీడియట్, సాంకేతిక, కళాశాల విద్యాశాఖల్లో లెక్చరర్లు, ఉద్యోగులు బదిలీల ప్రక్రియ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో ఈ నెల 20లోపు బదిలీలు పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు. రాష్ట్రంలో ఉద్యోగులకు సాధారణ బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేస్తూ ఈ నెల 3న సర్కారు జీవో జారీ చేసిన విషయం తెలిసిందే. 16 రోజుల్లో ప్రక్రియ పూర్తయ్యేలా ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ప్రక్రియంతా పూర్తయ్యి ఈ నెల 19, 20 తేదీల్లో బదిలీల ఉత్తర్వులు విడుదల కావాల్సి ఉంది. కానీ, ఇప్పటివరకు విద్యాశాఖలోని పలు హెచ్‌వోడీల్లో మార్గదర్శకాలే విడుదల కాలేదు. దీంతో బదిలీలు సకాలంలో జరుగుతాయా? లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికిప్పుడు మార్గదర్శకాలు విడుదలైతే ప్రక్రియ పూర్తయ్యేందుకు 10 రోజులు పడుతుంది. ఈ నేపథ్యంలో మరో 5 రోజులు గడువు పొడగించాలని కోరనున్నట్లు తెలిసింది.

బీరు సీసాల్లో ఉన్న పురుగులు, చెత్తాచెదారం

బీరు సీసాల్లో పురుగులు

కోనరావుపేట, జూలై 14: బీరు సీసాల్లో పురుగులు, చెత్తాచెదారం రావడంతో మద్యం ప్రియులు అవాక్కయ్యారు. ఈ ఘటన ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామ శివారులో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ వైన్స్‌లో వెలుగుచూసింది. మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు ఆదివారం శ్రీ లక్ష్మీనరసింహ వైన్స్‌లో నాలుగు బీర్లు కొనుగోలు చేశారు. వాటిలో రెండు బీరు సీసాల్లో పురుగులు, చెత్తాచెదారం కనిపించడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. నాణ్యత లేని బీర్లు సరఫరా చేస్తున్న వారిపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉచిత విద్యుత్ కట్ చేస్తున్నరు

- బకాయిలు విడుదల చేసి ఆదుకోండి
- నాయీబ్రాహ్మణ సేవా సంఘం డిమాండ్

హైదరాబాద్‌లో నిర్వహించిన సంఘ సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): రజక, నాయీ బ్రాహ్మణులకు అమలు చేస్తున్న 250 యూనిట్ల ఉచిత్ విద్యుత్ పథకానికి సంబంధించి బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సంఘ సమావేశంలో బాలకృష్ణ మాట్లాడారు. ఉచిత విద్యుత్‌కు సంబంధించి రూ.100 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సత్వరమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడంతో బిల్లులు కట్టాలని నాయీబ్రాహ్మణులు, రజకులను విద్యుత్ అధికారులు వేధిస్తూ, కనెక్షన్ కట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయీబ్రాహ్మణ ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చి పాలక మండలిని నియమించాలని, బడ్జెట్‌లో రూ.250 కోట్లు కేటాయించాలని, రూ.5లక్షల జీవిత బీమా కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘ నేతలు మాచర్ల రవి, గోలనుకొండ అశోక్, చందు శ్రీనివాస్, సింగిరాల వెంకటస్వామి, శ్రీరాములు నరేశ్, పగిడిపాల స్వామి, జంపాల శ్రీనివాస్, కొత్వాల రవి, రాజు, శ్రీరాములు, భూషణం పాల్గొన్నారు.

ప్రీలాంచ్ మోసం 100 కోట్లు!

మొదటిపేజీ తరువాయి...

గ్రామంలోని సర్వే నంబర్ 9, 10, 11, 15, 16ఏ లో కొత్త ప్రాజెక్టును అందుబాటులోకి తెస్తున్నదని, 2021 మార్చి నుంచి మొదలు పెడితే 42 నెలల్లోనే పూర్తి చేస్తుందంటూ నమ్మించారు. వాళ్ల మాటలను నమ్మి శశిభూషణ్ అందులో ఫ్లాట్ కొనేందుకు 30 శాతం అడ్వాన్స్‌గా రూ. 24.29 లక్షలు ఆన్‌లైన్‌లో చెల్లించాడు. టవర్ 1లో ఫ్లాట్ నంబర్ 2304 రెండు కారు పార్కింగ్‌లతో 2075 ఎస్‌ఎఫ్‌టీకి ఎంవోయూ రాసుకున్నారు. 18 నెలల తరువాత ప్రాజెక్ట్‌పై నమ్మకం లేకున్నా, ఒప్పందాన్ని రద్దు చేసుకోవచ్చని, అందుకు చెల్లించిన మొత్తానికి ఏడాదికి 8 శాతం వడ్డీతో తిరిగి ఇచ్చేస్తామంటూ ఒప్పందం చేసుకున్నారు. ఇటీవల ప్రాజెక్ట్ పరిస్థితి గురించి ఆరా తీసి, ఆ స్థలాన్ని శశిభూషణ్‌రెడ్డి సందర్శించాడు. బహుళ అంతస్థుల భవనాలు నిర్మిస్తామంటూ హామీ ఇచ్చిన స్థలానికి గేట్ వేసి ఉండడం, ఆ స్థలం రాహుల్ రస్తోగిది అంటూ అక్కడున్న వారు చెప్పారు. దీంతో కంగుతిన్న శశిభూషణ్ సంస్థ నిర్వాహకుడైన శ్రీనివాస్ మేక గురించి ఆరా తీశాడు. భూ యజమానికి ఎలాంటి డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ లేకపోవడం, ఇప్పటివరకు హెచ్‌ఎండీఏలో అనుమతులకు దరఖాస్తు చేయకపోవడంతో ఇదంతా మోసమని గుర్తించాడు. వెంటనే సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు. తమ నుంచి రూ. 1.39 కోట్లు వసూలు చేసి మోసం చేశారంటూ సంస్థపై నలుగురు బాధితులు సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు వందల సంఖ్యలో ఉన్నట్టు పేర్కొన్నారు. ఇటీవల సాహితీ ఇన్‌ఫ్రా, భువనతేజ, జీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల మోసం మరువకముందే, తాజాగా మరో సంస్థ అందులో చేరింది.

కరీంనగర్‌లో మాట్లాడుతున్న బండి సంజయ్

ఫీజు రీయింబర్స్‌మెంట్ బ్యాంక్ లోనా?

- వన్‌టైం సెటిల్‌మెంట్ ఎట్ల చేస్తరు?
- పార్టీ మారే ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించే దమ్ము ఉందా?: బండి సవాల్

విద్యానగర్, జూలై 14: 'ఫీజురీయింబర్స్‌మెంట్‌పై వన్‌టైం సెటిల్‌మెంట్ ఏంది? ఇదేమైనా బ్యాంకు అనుకుంటున్నరా? లోన్లు తీసుకుని వడ్డీలు కట్టలేక సెటిల్‌మెంట్ చేసుకోవడానికి' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ మండిపడ్డారు. ఏండ్ల తరబడి ఫీజులు కట్టకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని సూచించారు. ఆదివారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. 'అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరుతున్నారని మాట్లాడుతున్న అధికార పార్టీ నేతలారా? నిజంగా మీరు అభివృద్ధి చేస్తున్నట్టు భావిస్తే మీ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలందరితో రాజీనామా చేయించి ఉప ఎన్నికల్లో ప్రజా తీర్పు కోరే దమ్ముందా?' అని సవాల్ విసిరారు. ఎమ్మెల్యేలు తమ అక్రమాస్తులను కాపాడుకోవడానికే అధికార పార్టీలో చేరుతున్నారని మండిపడ్డారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరుతున్నామని వల్లించడం సిగ్గుచేటన్నారు. దొంగ హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి కాంగ్రెస్ నేతలు డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. కొందరేమో అధికారం ఎక్కడుంటే ఆ పార్టీలోకి జంప్ అవుతున్నారని విమర్శించారు. బీజేపీలో చేరేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నా.. రాజీనామా చేసి రావాలని చెబుతున్నామని, ఇదే తమ విధానమని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ మోసాలు, దొంగ హామీలను ప్రజలుగుర్తిస్తున్నారని.. అశోక్‌నగర్‌లో నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనే ఇందుకు నిదర్శనమని అన్నారు.

- ఎస్సై కుటుంబానికి 25 లక్షల ఆర్థికసాయం

దివంగత ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ కుటుంబానికి సివిల్ టీఎస్, ఏపీ ఎస్సైస్ వెల్ఫేర్ సొసైటీ చేయూతనిచ్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఎస్సైగా పనిచేస్తున్న శ్రీనివాస్ ఇటీవల ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ ఈ నెల 7న మృతి చెందిన విషయం తెల్సిందే. ఎస్సైల బృందం ఆదివారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేటకు చేరుకొని శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో శ్రీనివాస్ భార్య కృష్ణవేణికి రూ.25 లక్షల ఆర్థికసాయం అందజేశారు.

– నల్లబెల్లి

పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

- ఐదు రోజుల పాటు భారీ వర్షాలు: వాతావరణశాఖ

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో వచ్చే ఐదురోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో పలు జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో కోస్తాంధ్ర ప్రదేశ్‌లో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో శనివారం ఏర్పడిన ఆవర్తనం పశ్చిమ బెంగాల్ మీదుగా ఏర్పడిన ఆవర్తనంలో కలిసిపోయిందని పేర్కొన్నది. నేటి నుంచి ఐదు రోజుల పాటు ఆయా జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురియవచ్చని పేర్కొన్నది. ఆదివారం హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసింది. చాలా ప్రాంతాల్లో ప్రధాన రోడ్లపైకి వరద చేరడంతో, వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో నగరంలో ట్రాఫిక్ పెద్ద ఎత్తున నిలిచిపోయింది. ముఖ్యంగా మాదాపూర్, హైటెక్ సిటీ మార్గంలో ట్రాఫిక్ జామ్ అయ్యింది. ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని ట్రాఫిక్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది వాహనదారులను కోరారు. యూసఫ్‌గూడలోని శ్రీకృష్ణనగర్‌లో ఓ కారు వరదలో కొట్టుకుపోయింది.

హైదరాబాద్ రాంనగర్‌లో కురుస్తున్న భారీ వర్షం